క్లుప్తంగా

పాఠశాలలో తనిఖీలు



విద్యార్థుల వర్క్‌బుక్స్ పరిశీలిస్తున్న ఎంఈఓ-2 బాలభాస్కరరావు

వేపాడ: మండలంలోని కరకవలస ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ-2 బాలభాస్కరరావు గురువారం తనిఖీలు చేశారు. విద్యార్థు లు, ఉపాధ్యాయుల హాజరు రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల వర్క్‌బుక్స్ పరిశీలించి, వారితో తెలుగు, ఇంగ్లిష్ పదాలు, టేబుల్స్ చదివించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే విద్యార్థులు రోజూ యూనిఫారం ధరించేలా, టై, బూట్లు వేసుకునేలా, పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం మధ్యాహ్న భోజన వంటకాలను పరిశీలించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులకు నగదు అందజేస్తున్న దాత శ్రీనివాసరావు

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధి రెడ్డిపేట సమీపంలో ఉన్న నాగ వెంకటలక్ష్మి షా మిల్ యజమాని అడగర్ల శ్రీనివాసరావు,దంపతులు రూ.50, 116 విరాళం ప్రకటించారు. ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు అప్పికొండ ఆదిబాబు, గంట్యాడ విష్ణుమూర్తి, దాసరి రవికి దా త తన మిల్లు వద్ద గురువారం నగదు అందజేశారు. ఇప్పిలి తిరుమల, దిలీప్‌కుమార్, పీతల మురళి, గొల్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఓటు ఆవశ్యకత, నమోదుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసమిశ్ర

కొత్తవలస: ఓటు హక్కు ఆవశ్యకత, నమోదుపై స్థానిక వాగ్దేవి విద్యాసంస్థలో విద్యార్థులకు తహసీల్దార్ శ్రీనివాస్‌మిశ్ర గురువారం అవగాహన కల్పించారు. తహసీల్దార్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిని యువతీ,యువకులు అంతా ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని అన్నారు. సమర్థ వంతమైన నాయకులను ప్రజాప్రతిని ధు లుగా ఎన్నుకునే అవకాశం కేవలం ఓటు ద్వారా మాత్రమే సాధ్యమన్నారు. డిప్యూటీ తహసీల్దార్ కోట అప్పారావు, వాగ్దేవి విద్యాసంస్థల అధినేత కె.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థిని ఝాన్సీని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శృంగవరపుకోట: రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్-17బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎస్.కోట ప్రభుత్వ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని కిల్లో ఝాన్సీ ఎంపికైందని ఆ పాఠశాల పీడీ లక్ష్మణరావు గురువారం చెప్పారు. ఇటీవల గజపతినగరంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ఝాన్సీ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హతసాధించింది. విద్యార్థినిని హెచ్‌ఎం జగదీశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి సూర్యనారాయణ

గజపతినగరం: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో ఖరీఫ్ వరి పంట ఎండిపోవడంతో రైతులు తీవ్రనష్టాలు పాలయ్యారని, ప్రభుత్వం విజయనగరం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని పురిటిపెంట గ్రామంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాలు లేక ఎండిపోయి పూర్తిగా దెబ్బతిన్న వరిపొలాలను అధికారులు పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రజలు, కార్మికుల సమస్యలను గాలికొదిలేసి తీవ్రఅన్యాయం చేస్తోందని మండిపడ్డారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధర లను తగ్గించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు బి.రాంబాబు, గొర్లె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమం

- 'గడప గడపకూ మన ప్రభుత్వంలో' జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



మెరకముడిదాం: బైరిపురంలో మహిళలకు పథకాలరు వివరిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, నాయకులు

మెరకముడిదాం: రాష్ట్రంలో ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బైరి పురం గ్రామంలో గురువారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి జెడ్పీ చైర్మన్ ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా, సమ స్యలు ఏమైనా ఉన్నాయా అని ప్రజలను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధికి సీఎం జగన్ సమప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. ఎన్నికల హామీల్లో 95 శాతానికి పైగా అమలు చేశారన్నారు. డ్వాక్రా మహిళలకు దశల వారీగా రుణమాఫీ చేశామని, 45 ఏళ్లు నిండిన మహిళలకు వైఎస్సార్ చేయూత పథకం కింద ఏడాదికి రూ.18,750 చొప్పున అందించామని చెప్పారు. పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యంగా అనేక పథకాలను అమలు చేస్తూ, వాటిని పార్టీలకతీతంగా అర్హులకు పారదర్శకంగా అందిస్తున్నామని వివరించారు. విద్య, వైద్యరంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సంక్షేమం కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు పలకాలని ప్రజలను కోరారు. ఎంపీడీఓ ఎం.రత్నం, హెచ్‌డీటీ గిరిధర్,ఎ పీఆర్ డీఈ రమణమూర్తి, పీఆర్ ఏఈ హరికృష్ణ, ఏఓ శ్రావణితేజ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి, సర్పంచ్ పప్పల విజయ, వైస్ ఎంపీపీలు కందులపార్వతి, తలచుట్ల హరిబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి తాడ్డి వేణుగోపాలరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోట్ల విశ్వేశ్వరరావు,నాయకులు కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, పప్పలకృష్ణమూర్తి, పప్పల జ్ఞానేశ్వరరావు, కందుల మల్లికార్జునరావు, రైల్వే బోర్డు మెంబర్ తాడేల ఉమా వెంకటమహేశ్వరరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు



గుర: గుజ్జంగివలసలో పథకాలను వివరిస్తున్న జెడ్పీటీసీ అప్పలనాయుడు, నాయకులు సన్యాసినాయుడు, తదితరులు

గుర్ల: పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా ఆశీర్వదించాలని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు సన్యాసినాయుడు కోరారు. మండలంలోని గుజ్జంగివలసలో 'గడప గడపకు మనప్రభుత్వం' కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలనలో ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా కలిగిన లబ్ధిని వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలన్నీ సచివాలయాల ద్వారా గ్రామాల్లోనే అందిస్తున్నామని చెప్పారు. ఎంపీడీఓ కల్యాణి, డీఎల్‌డీఏ చైర్మన్ బెల్లాన బంగారు నాయుడు, వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, సర్పంచ్ రెడ్డి పద్మావతి, గూడెం పీఏసీఎస్ చైర్మన్ రెడ్డి మురళీధరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జమ్ము స్వామినాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డి అప్పలనరసయ్య, అట్టాడ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రులకు వెళ్లి పింఛన్ అందజేత



వృద్ధుడు అప్పన్నకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ తులసి



రామకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రాము

గంట్యాడ: మండలంలోని మదనాపురం గ్రామవలంటీర్లు గురువారం విశాఖపట్నంలోని ఆస్పత్రులకు వెళ్లి పింఛన్ అందజేశారు.మదనాపురం గ్రామానికి చెందిన వృద్ధుడు నక్క అప్పన్న ఒమెగా క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందు తున్నాడు. ఆయనకు నవంబర్ నెలకు సంబంధించిన పింఛన్‌ను వలంటీర్ బండారు తులసి అందజేశారు. అలాగే వికృతి క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మేడిద రామకు వలంటీర్ రాము పింఛన్ డబ్బులు అందజేశారు.

స్కౌట్ విద్యార్థులకు అభినందన



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో హెచ్‌ఎం ఈశ్వరరావు,ఉపాధ్యాయులు

కొత్తవలస: విజయవాడలో గత నెల 30వ తేదీ నుంచి ఈనెల ఒకటో తేదీ వరకు నిర్వహించిన సదరన్ రైల్వే డ్రిస్టిక్ ర్యాలీలో కొత్త వలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సేవాశ్రీ స్కౌట్స్ యూనిట్ విద్యార్థులు పాల్గొని పలు అంశాల్లో ఉత్తమ ప్రదర్శన ఇచ్చి ప్రశంసాపత్రాలు సాధించారు. వీరిని హెచ్‌ఎం సీహెచ్.ఈశ్వరరావు, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు. స్కౌట్ మాస్టర్ బి.పి.ఏ.రాజు, గైడ్ కెప్టెన్ ఏ.కనకమహాలక్ష్మి మాట్లాడుతూ ర్యాలీకి రాష్ట్రం నలుమూలల నుంచి 600 మంది విద్యార్థులు హాజరయ్యాని పేర్కొన్నారు. జిల్లా నుంచి 10 మంది పాల్గొనగా అందులో కొత్తవలస హైస్కూల్‌కు చెందిన ఆరుగురు కవాతు, ప్రథమచికిత్స, పయినీరింగ్, వైల్డ్ కుకింగ్, నాట్స్ తదితర అంశాలను ప్రదర్శించారు. వీటిలో వైల్డ్ కుకింగ్ అంశానికి బహుమతి లభించిందని చెప్పారు.

ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం



దత్తిరాజేరు: దత్తి గ్రామంలో వృద్ధుడికి కళ్లద్దాలు అందజేస్తున్న ఎంపీపీ సింహాద్రిఅప్పలనాయుడు



గుర్ల: గుజ్జంగివలసలో వృద్ధుడికి మందుల కిట్ అందజేస్తున్న జెడ్పీటీసీ అప్పలనాయుడు, నాయకుడు సన్యాసినాయుడు



దత్తిరాజేరు: దత్తి శిబిరంలో ప్రజలతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

గుర్ల: ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు సన్యాసినాయుడు అన్నారు. గుజ్జంగివలసలో గురువారం నిర్వహించిన జగనన్నఆరోగ్య సురక్ష శిబిరాన్ని వారు సందర్శించారు. శిబిరంలో ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలపై వైద్యాధికారులను ఆరా తీశారు.అవసరమైన వారికి మందుల కిట్‌లు, వృద్ధులకు కళ్లద్దాలు అందజేశారు. డీఎల్‌డీఏ చైర్మన్ బెల్లాన బంగారునాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జమ్ము స్వామి నాయుడు, సర్పంచ్ మీసాల కల్యాణి, వైద్యాధికారి షర్మిల తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా కార్పొరేట్ వైద్యం

దత్తిరాజేరు: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా ప్రజలకు గ్రామాల్లోనే కార్పొరేట్‌స్థాయి వైద్యం ఉచితంగా అందుతోందని ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు అన్నారు. దత్తి గ్రామంలోని ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రజలంతా సంపూర్ణఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని అన్నారు. అందులో భాగంగానే వైద్య నిపుణులను గ్రామాల్లోకి పంపించి అన్ని వైద్యపరీక్షలు చేయిస్తున్నారని, శస్త్రచికిత్సలు, మెరుగైన వైద్యం అవసరమైన వారిని కార్పొరేట్ ఆస్పత్రులకు సిఫార్సు చేసి ఉచితంగా వైద్యం అందిస్తున్నట్లు పేర్కొన్నా రు. అనంతరం కంటి వెలుగు ద్వారా నేత్ర శస్త్ర చికిత్స చేయించుకున్న వారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు కడుబండి రమేష్‌నాయుడు, తలారి రామస్వామి, బోడసింగి సత్తిబాబు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

శిబిరాన్ని సందర్శించిన డీఎంహెచ్‌ఓ

దత్తి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్యసురక్ష శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి(డీఎంహెచ్‌ఓ) భాస్కరరావు సందర్శించారు. శిబిరంలో వైద్యులు అందిస్తున్న సేవలపై ప్రజలను ఆరా తీయడంతో పాటు మందులను పరిశీలించారు. ఇప్పటి వరకు జిల్లాలో నిర్వహించిన ఆరోగ్యసురక్ష శిబిరాల్లో 2.80 లక్షల పరీక్షలు చేశామని, 6 వేల మందిని వివిధ శస్త్రచికిత్సలకు ఎంపిక చేశామని చెప్పారు.

కంప్యూటర్ల చోరీపై ఫిర్యాదు

లక్కవరపుకోట: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో రెండు కంప్యూటర్లు చోరీ అయిన ఘటనపై ప్రిన్సిపాల్ వై.ఎస్. ఎస్.ప్రకాష్‌రావు స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. పాఠశాలలో సెప్టెంబర్-17వ తేదీన రెండు కంప్యూటర్లు కనిపించకుండా పోయాయని, నాటి నుంచి వెతికినా ప్రయోజనం లేకుండా పోయిందని ప్రిన్సిపాల్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, దర్యాప్తు ప్రారంభిస్తామని హెడ్‌కానిస్టేబుల్ సీహెచ్.త్రిమూర్తులు తెలిపారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కొత్తవలస: మండలంలోని చీపురువలస గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న అన్నంరెడ్డి శ్రీనును స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఎస్‌ఈబీ సీఐ సీహెచ్.రాజేశ్వరి ఆధ్వర్యంలో ఎస్ఐ నరేంద్రకుమార్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. నిందితుడు శ్రీను నివాసం లో నిల్వ ఉంచిన 7 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కేంద్రం వైఖరికి నిరసనగా 8న బంద్

శృంగవరపుకోట: రాష్ట్ర ప్రయోజనాలను తుంగలో తొక్కేసి, రాజకీయ క్రీడ ఆడుతున్న కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరిని తిప్పికొట్టేందుకు ఈనెల 8న తలపెట్టనున్న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్ఐ నేతలు కోరారు. బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం లో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎస్‌ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వి.చినబాబు మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రైవేటు వ్యక్తులకు అమ్మేసి రాష్ట్రానికి కేంద్రం మరింత అన్యాయం చేయాలని చూస్తోందని ఆరోపించారు. రాయలసీమలో వలసల నియంత్రణకు కడపలో ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు విభజన చట్టంలో అంగీకరించి ఇప్పుడు కడప ఉక్కు సాధ్యం కాదని చెప్పడం బీజేపీ ప్రభుత్వం నిస్సిగ్గు తీరుకు నిదర్శనమని మండిపడ్డారు. రాష్ట్ర ప్రయోజనాలను తుంగలో తొక్కేస్తున్న కేంద్రప్రభుత్వంపై రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష, పార్టీలు పోరాటం చేయడం లేదని, బీజేపీ మెడలు వంచేందుకు ఎస్‌ఎఫ్ఐ ఉద్యమించనున్నట్లు చెప్పారు. ఎస్‌ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు రవి, రమేష్, సోమేష్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



నడుపూరు హైస్కూల్ విద్యార్థులకు క్రీడా పరికరాలు అందజేస్తున్న జెడ్పీటీసీ అప్పలనాయుడు

గుర్ల: చదువుతో పాటు క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఉన్నత భవిష్యత్ ఉంటుందని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు అన్నారు. ప్రభుత్వం సమకూర్చిన క్రీడా పరికరాలను మండలంలోని నడుపూరు ఉన్నత పాఠశాలకు గురువారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ప్రతీ పాఠశాలకు క్రీడాసామగ్రిని అందజేస్తోందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగించుకోవాలని సూచించారు. సర్పంచ్ కర్రోతు తాతమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలకు వంటపాత్రలు అందజేత



ఎండీఎం నిర్వాహకులకు వంట పాత్రలు అందజేస్తున్న సర్పంచ్ అప్పలరాజు

గుర్ల: మండలంలోని గొలగాం ప్రాథమిక పాఠశాలకు ప్రభుత్వం సమకూర్చిన వంటపాత్రలను మధ్యాహ్న భోజన పథకం(ఎండీఎం) నిర్వాహకులకు సర్పంచ్ కలిశెట్టి అప్పలరాజు గురువారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల చదువుతో పాటు వారి ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. అందులో భాగంగానే జగనన్న గోరుముద్ద పథకం ద్వారా విద్యార్థులకు రోజుకో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తోందని చెప్పారు. నిర్వాహకులు వంటకాలను రుచికరంగా చేసి విద్యార్థులకు అందించాలని సూచించారు. నాడు -నేడు ద్వారా పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. హెచ్‌ఎం బాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమగ్రంగా ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ సర్వే



మాట్లాడుతున్న గజపతినగరం నియోజకవర్గ ఈఆర్‌ఓ వెంకటేశ్వరరావు

గజపతినగరం: ఎన్నికలు దగ్గర పడుతున్నందున ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ (ప్యూరిఫికేషన్) సర్వేను బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలు సమన్వయంతో సమగ్రంగా చేయాలని గజపతి నగరం నియోజకవర్గం ఓటర్ల నమోదు అధికారి(ఈఆర్‌ఓ) బి.వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక పురిటి పెంట స్కూకాలనీలో పాత మండల పరిషత్ భవనంలో బీఎల్ ఓలు,బీఎల్‌ఎలకు ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ సర్వేపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాను తీసుకుని ఇంటింట సర్వే చేయాలని చెప్పారు. ప్రతీ ఇంటిలో ఎంత మంది ఓటర్లు ఉన్నారు, ఇంకా ఆ ఇంటిలో ఎవరైనా ఓటు హక్కుకు అర్హులు ఉన్నారా, క్లయిమ్స్(డెత్‌లు, తొలగింపులు) ఏమైనా ఉన్నాయా తది తర వివరాలను అడిగి తెలుసుకోవాలని సూచించారు. క్లయిమ్స్ ఉంటు ఫారం-7, చేర్పులు ఉంటే ఫారం - 6, మార్పులు ఉంటే- ఫారం-8 క్లయింట్ల లకు ఇచ్చి సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా, పక్కాగా ఉండేలా చూసుకోవాలని, 18ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించాలని ఆదేశించారు. గజపతినగరం మండల ఓటర్ల నమోదు సహాయ అధికారి (ఏఈఆర్‌ఓ) ఎం.అరుణ కుమారి, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రాఫ్ట్ పోటీల్లో ధర్మవరం విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులు, ఉపాధ్యాయిని సూర్యకుమారిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శృంగవరపుకోట: పైడితల్లమ్మ పండగ, విజయనగరం ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన క్రాఫ్ట్ పోటీల్లో ధర్మవరం ఉన్నత పాఠశాల విద్యార్థు లు ప్రతిభ కనబరిచారు. విద్యార్థులు పెద్దింటి రాజేష్, కె.జయప్రకాష్ తయారు చేసిన పువ్వులు, బొకేలు, తోరణాలు విశేషంగా ఆకట్టుకుని, నిర్వాహకుల ప్రశంసలు పొందాయి. డివిజన్ స్థాయిలో చూపిన ప్రతిభకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు సాధిం చిన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయిని సూర్యకుమా రిని హెచ్‌ఎం ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు గురు వారం అభినందించారు.

యువకుడి ఆత్మహత్య



కిశోర్ (ఫైల్)

పరవాడ: మండలంలోని ఈ.బోనంగి శివారు గౌతులచ్చన్ననగర్ సమీపంలో నివాసం ఉంటున్న గేదెల కిశోర్(18) అనే విద్యార్థి గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ సురేష్ అందించిన వివరాల ప్రకారం... విజయనగరం జిల్లా లక్కవరపుకోట మండలం కళిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన గేదెల వెంకటరావు భార్య, ఇద్దరు సంతానంతో ఉద్యోగ రీత్యా గౌతులచ్చన్ననగర్ సమీపంలో నివాసం ఉంటున్నాడు. వెంకటరావు ఫార్మాసిటీలోని ఓ పరిశ్రమలో విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పెద్ద కుమారుడు కిశోర్ షీలానగర్‌లో బెహరా పాలిటెక్నికల్ కళాశాలలో డిప్లమో రెండో సంవత్సరం చదువుతున్నాడు. కిశోర్ గురువారం ఇంటి వద్దే ఉన్నాడు. సాయంత్రం 5 గంటలకు అతడి చెల్లి అపరంజిని ఇంటి తలుపు తీయగా లోపల ఫ్యాన్‌కు ఉరివేసుకొని అన్నయ్య కనిపించడంతో తల్లికి చెప్పింది. స్థానికుల సహాయంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ సురేష్ ఘటనా స్థలానికి చేరుకొని ఫ్యానుకు వేలాడుతున్న కిశోర్‌ను కిందకు దించారు. కిశోర్ మృతి చెందడానికి గల కారణాలు పోస్టుమార్టం రిపోర్టులో వెల్లడవుతాయని ఎస్ఐ సురేష్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు.

చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలి

- ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ శారదా జయలక్ష్మీదేవి



వ్యవసాయ పరిశోధన స్థానంలో పర్యటిస్తున్న శారదా లక్ష్మీదేవి, తదితరులు

విజయనగరం ఫోర్ట్: చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలని ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్. శారదా జయలక్ష్మీదేవి అన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆమె స్థానిక గాజులరేగ వ్యవసాయ పరిశోధన స్థానాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పడిపోని రకాలు, పక్షుల బెడద నుంచి తట్టుకునే కంకు ఉండే రకాలను వృద్ధి చేయాలన్నారు. అదేవిధంగా అగ్గితెగులు తట్టుకునే రకాలపై పరిశోధనలు చేయాలని సూచించారు. జిల్లాకు విశిష్ట అనే వేరుశనగ రకాన్ని పరిచయం చేయాలన్నారు. భూమిలేని వారికి కోళ్ల పెంపకం, పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ ఇచ్చి.. ఆదాయం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రానున్న రోజుల్లో చిరుధాన్యాలు, ఆరుతడి పంటల అవసరం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉత్తర కోస్తా జిల్లాల సహ పరిశోధన సంచాలకుడు డాక్టర్ పీవీకే జగన్నాథరావు, శాస్త్రవేత్తలు డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ నర్సుపల్లి అనురాధ, తేజశ్వేరావు, తదితరులు పాల్గొన్నారు.

సిరిమాను తరలింపు రేపు

విజయనగరం టౌన్: పైడితల్లి సిరిమానును శనివారం ఉదయం 7 గంటలకు ఆలయం వద్దనుంచి హుకుంపేటలో ఉన్న రాజగోపాల్ టాంఛ్రీకి తరలించనున్నట్లు పూజారి బంటుపల్లి వెంకటరావు తెలిపారు. ఈ మేరకు టాంఛ్రీ పరిసరాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిరిమానును తీసుకువచ్చే మార్గాలను చూశామని, ఎటువంటి ఇబ్బందుల్లేకుండా దీక్షాపరుల భజనలతో వేకువజామున సిరిమాను తరలిస్తామన్నారు. దీక్షాపరులందరూ సమయానికి హాజరుకావాలని కోరారు.

ఏటీఎం విధానంతో నిరంతర ఆదాయం

విజయనగరం రూరల్: రైతులు ఏటీఎం విధానంలో పలు రకాల పంటలు సాగు చేయడం ద్వారా నిరంతర ఆదాయం పొందవచ్చని ఆర్‌టీఎల్ ప్రకాష్, ఆర్బీఓ హేమసుందర్ అన్నారు. మండలంలోని కోరుకొండలో రైతులు సాగు చేస్తున్న ఏటీఎం విధానాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ, ఏటీఎం మోడల్‌తో సాధారణ పంటలతో పాటు ఆకుకూరలు, కూరగాయలు, తీగజాతి మొక్కలతో ఆదాయంతో పాటు ఆరోగ్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మెంటర్ ఎస్.నాగమణి, మండల యాంకర్ ఎస్.మహేష్, తదితరులు పాల్గొన్నారు.